నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, ఆదివారం 20 అక్టోబర్ 2024 | VIKARABAD



# డబుల్ ఇండ్లు సమస్యలకు నెలవు

**అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం**

**తాగునీరు సైతం రావడం లేదంటూ బాధిత మహిళల ఆవేదన**

**గ్రిల్ లేకుండా ఉండడంతో చిన్నారులకు పొంచి ఉన్న ప్రమాదం**

**పనిచేయని లిఫ్ట్‌లు.. అపరిశుభ్ర వాతావరణం**

సిటీబ్యూరో, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఇల్లు కోల్పోయి గుండెలు అలిసిపోయిన బాధితులకు డబుల్ బెడ్రూం ఇండ్లలోనూ సమస్యలే స్వాగతం పలికాయి. అధికారులు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇండ్లలో తాగునీరు లేక అవస్థలు పడుతున్నట్టు ఫాతిమా తెలిపింది. తమది ఉమ్మడి కుటుంబం అని.. ఇప్పుడు ఒకే డబుల్ బెడ్రూంలో ఉండలేకపోతున్నామంటూ ఓ మహిళ తన గోడు వెల్లబోసుకున్నది. హార్ట్ పేషెంట్ ఉన్న తనకు 7వ అంతస్తులో ఇల్లు కేటాయించారని మరో మహిళ తెలిపింది. ఫ్లోర్‌లకు గ్రిల్ లేకపోవడంతో మెట్లు దిగుతుంటే భయం వేస్తున్నదని బాధిత మహిళలు చెబుతున్నారు. చిన్నారులతో ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఉన్నదని, అధికారుల దృష్టికి తీసుకొచ్చినా సమస్యను పరిష్కరించడం లేదని వాపోయారు. బాత్‌రూముల్లో మురుగు వెళ్లే పైపులు జాం అయిపోయి గదులన్నీ దుర్వాసనతో నిండుకుంటున్నాయని మహ్మద్ ఖాన్ అనే వ్యక్తి తెలిపాడు. నీళ్లు ఎప్పుడొస్తాయో తెలియని దుస్థితి పిల్లిగుడిసెలలో డబుల్ బెడ్రూంల ఉన్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వయస్సు 65 ఏండ్లని.. ఈ వయస్సులో 4 ఫ్లోర్‌లు దిగి కిందికి వెళ్లి నీళ్లు తీసుకొచ్చుకుంటామా? అని ప్రశ్నించారు. సమస్యలపై ప్రతిరోజూ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఏ ఒక్కరూ వాటిని పరిష్కరించడంపై దృష్టి సారించడం లేదని విమర్శించారు. ఎన్నో ఏండ్లుగా ఉన్న తమ ఇండ్లను కూల్చేసి.. వద్దన్నా బలవంతంగా డబుల్ బెడ్రూంలు ఇచ్చారని.. కనీసం ఇందులోనైనా అన్ని వసతులు కల్పిస్తారనుకుంటే ఏదీ లేదని మూసీ బాధితులు వెల్లడించారు. ఇండ్లను కూల్చడం మాకు నచ్చలేదంటూ అధికారుల వద్దే మొర పెట్టుకుంటున్నారు. కాగా, మూసానగర్, శంకర్ నగర్‌లో 150 ఇండ్లను అధికారులు నేలమట్టం చేసి... వారందరినీ డబుల్ బెడ్రూం ఇండ్లకు తరలించినట్టు అధికారులు తెలిపారు. కాగా, రివర్‌బెడ్‌లో ఉన్న 2166 నిర్మాణాలు, బఫర్ జోన్‌లో 7,851 నిర్మాణాలను అధికారులు కూల్చబోతున్నారంటూ మూసీ పరీవాహక ప్రాంతాల ప్రజలు భయాందోళనలో ఉన్నారు.

### మూసీని మించిన కంపు

**-హరికాంత్, మూసీ బాధితుడు.**



నాది మూసానగర్. వయస్సు 63. ఎన్నో ఏండ్లుగా అక్కడే ఇల్లు నిర్మించుకొని ఉన్నా. పిల్లలంతా నాతోపాటే ఉండేవాళ్లు. ఇప్పుడు మూసీ అభివృద్ధి పేరుతో మా ఇల్లును బలవంతంగా కూల్చేశారు. నాకు పిల్లిగుడిసెల్లో డబుల్ బెడ్రూం ఇచ్చారు. కానీ అక్కడ తాగునీరు సరిగా లేదు. బాత్‌రూం పైపుల నిర్వహణ సరిగా లేదు. కంపును భరించలేకపోతున్నాం. తాగునీరు కూడా సరిగా రావడం లేదు. లిఫ్ట్‌లు పనిచేయవు. కిందకి దిగాలన్నా.. మీదకు వెళ్లాలన్నా నరకమే. ఎందుకు మాకు ఈ శిక్ష. ప్రశాంతంగా మా ప్రాంతంలో బతికే మాకు రేవంత్ సర్కార్ భరించలేని శిక్షను విధించింది. బంధువులు, స్నేహితులు కూడా మా ఇంటికి వచ్చే పరిస్థితి లేదు. గతంలోని ఇంట్లో ఉన్నప్పుడు అందరూ వచ్చి చాయ్ తాగి ముచ్చట పెట్టి పోయేవాళ్లు. ఇప్పుడు నన్ను చూడటానికి నాలుగు అంతస్తులు ఎక్కే ఓపిక ఎక్కడిది.





నాగోల్‌లోని ఎస్‌టీపీని పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్సీ మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, బండారి లక్ష్మారెడ్డి, ముఠాగోపాల్

# మూసీ శుద్ధికి బీఆర్‌ఎస్ బీజం

## రూ.3866 కోట్లతో నిర్మిస్తున్న ఎస్‌టీపీలతోనే ప్రక్షాళన

- పేదల ఇండ్లను రక్షించేందుకు అడ్వకేట్లను నియమించాం
- రేవంత్ పాలనలో పేదలు రోడ్డుపాలు
- నష్టపరిహారం ఎంతిస్తారో చెప్పాలి
- రూ.లక్షన్నర కోట్లు దోచుకునేందుకే మూసీ ప్రక్షాళన
- నాగోల్ ఎస్‌టీపీని పరిశీలించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




మన్సూరాబాద్, అక్టోబర్ 19: మూసీ ప్రక్షాళన పేరుతో రూ.లక్షన్నర కోట్లను దోచుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి పథకం వేసుకున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు తమ ఇండ్లు పోతాయని ఆందోళన చెందవద్దని, వారి ఇండ్లను రక్షించేందుకు అడ్వకేట్లను నియమించామని.. ఇప్పటికే 500 మంది ఇండ్లకు కోర్టు నుంచి స్టే తీసుకొచ్చినట్లు చెప్పారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని మూసీ పరీవాహక ప్రాంత ప్రజలు తమ ఇండ్లకు సంబంధించిన దస్తావేజులను స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి అందజేస్తే త్వరలో వారికి ఇండ్ల సంరక్షణ కోసం కోర్టు నుంచి స్టే తీసుకువస్తామని తెలిపారు. ఎల్బీనగర్ నియోజకవర్గం నాగోల్, మల్లికార్జునహిల్స్‌లో రూ. 400 కోట్లతో నూతనంగా నిర్మించిన 320 ఎంఎల్‌డీ ఎస్‌టీపీ ప్లాంటును శనివారం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరిశీలించారు. రెండు రోజుల్లో ప్రారంభం కానున్న ఎస్‌టీపీ వల్ల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని కేటీఆర్ తెలిపారు. శుద్ధి కాకముందు.. శుద్ధి అయిన తరువాత ఉన్న నీటిని ప్రజలకు చూపించి.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందు చూపుతో ఏర్పాటు చేసిన ఎస్‌టీపీ వల్ల జరిగే మేలును ప్రజలకు వివరించారు.మంచిరేవుల నుంచి నాగోల్ దిగువ వరకు రూ. 3866 కోట్లతో నిర్మిస్తున్న ఎస్‌టీపీలతో మూసీ ప్రక్షాళన జరుగుతుందని.. ఇప్పుడు కొత్తగా రేవంత్‌రెడ్డి వచ్చి చేసేది ఏమీ లేదని కేటీఆర్ అన్నారు.

### నష్టపరిహారం ఎంత ఇస్తారో చెప్పాలి

**ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి డిమాండ్**

మూసీని శుద్ధి చేసే ప్రక్రియ బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలోనే ప్రారంభమైందని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మార్గదర్శకంలో మూసీ సుందరీకరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. అందులో భాగంగానే పలు ప్రాంతాల్లో ఎస్‌టీపీలను నిర్మించామన్నారు. ఎస్‌టీపీల్లో శుద్ధి అయిన నీరు దిగువకు పోవడం వల్ల ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలోని రైతాంగానికి మేలు జరుగుతుందన్నారు. మూసీ ప్రక్షాళన పేరుతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదల కుటుంబాలను రోడ్ల పాలు చేస్తున్నారన్నారు. బఫర్‌జోన్ పేరుతో ఇండ్లను కూలిస్తే మూసీ పరీవాహక ప్రాంతాల్లో సుమారు 13 నుంచి 14 వేల కుటుంబాల్లోని సుమారు లక్ష మంది నిరాశ్రయులుగా మారే అవకాశం ఉందన్నారు. మూసీ ప్రక్షాళనకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యతిరేకం కాదని, పరీవాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలకు నష్ట పరిహారం ఎంత చెల్లిస్తారో ముందు తెలియజేయాలన్నారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకుని కట్టుకున్న ఇండ్లను ఖాళీ చేసి వెళ్లమంటే ప్రజలు ఎక్కడికి వెళ్లాలి.. ఎలా బతకాలని ఆయన ప్రశ్నించారు. కేటీఆర్ వెంట ఎమ్మెల్సీ మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, కేపీ వివేకానంద్‌గౌడ్, కాలేరు వెంకటేశ్, బండారి లక్ష్మారెడ్డి, మాధవరం కృష్ణారావు, ముఠా గోపాల్, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచెర్ల గ్రామంలోని పచ్చనిపొలాలు

# పచ్చని పొలాల్లో.. ఫార్మా చిచ్చు..

సీఎం సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేయ తలపెట్టిన ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా రైతులు ఉద్యమిస్తున్నారు. పచ్చని పంట పొలా ల్లో చిచ్చు పెట్టేలా..సర్కారు ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయంపై మండిపడుతు న్నారు. ప్రాణాలైనా ఇస్తాం.. కానీ, సాగు భూములను ఇచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు.

- వికారాబాద్, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ)

**కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా విలేజ్ ఏర్పాటును వ్యతిరేకిస్తున్న అన్నదాతలు, ప్రజలు**

- ప్రభుత్వ నిర్ణయంపై మండిపాటు
- ఫార్మా కంపెనీలకు వ్యతిరేకంగా రైతుల ఆందోళనలు, కార్యాలయాల ముట్టడి
- ప్రాణాలైనా ఇస్తాం.. కానీ, సాగు భూములివ్వబోమని స్పష్టం
- ఫార్మా విలేజ్‌కు 1,274 ఎకరాల భూసేకరణకు ప్రభుత్వ నిర్ణయం
- ఇప్పటికే 703 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ జారీ
- ఫార్మా విలేజ్ వద్దే..వద్దంటున్న పోలేపల్లి, లగచెర్ల, హకీంపేట గ్రామస్తులు

కొన్నేండ్లుగా వ్యవసాయాన్ని సాగు చేసుకుంటూ జీవిస్తున్న తమ పంట పొల్లాలను ఫార్మా కంపెనీలకు ఇచ్చేది లేదని రైతులు స్పష్టం చేస్తున్నారు. ఏటా వరి పంటను సాగు చేస్తూ మేం తింటూ, పదిమందికి అన్నం పెట్టే పచ్చని సాగు భూముల్లో కాలుష్యం వెదజల్లే కంపెనీలను ఏర్పాటు చేయడమేమిటని ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్న మూడు గ్రామాల్లోనే కాకుండా వాటి చుట్టూ ఉన్న పలు గ్రామాల్లోనూ వ్యవసాయం బంద్ అవుతుందని.. తాగు, సాగు నీరు కలుషితమై ప్రజలు రోగాల బారిన పడే పరిస్థి తి వస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ కడుపు కొట్టొదని.. కొడంగల్ నియోజకవర్గంలో సాగుకు అనుకూలంగా లేని భూములు చాలా ఉన్నాయని వాటిలో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. సర్కారు ఫార్మా విలేజ్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ ఉద్యమిస్తూనే ఉంటామని పలు గ్రామాల ప్రజలు స్పష్టం చేస్తు న్నారు.

**ఫార్మా విలేజ్ వద్దే.. వద్దు..**

దుద్యాల మండలంలోని హకీంపేట, పోలేపల్లి, లగచెర్ల గ్రామాల్లో ప్రభుత్వం ఫార్మా విలేజ్‌ను ఏర్పాటు చేయాలని భావించగా..అప్పటి నుంచి ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతూనే ఉన్నది. ఈ మూడు గ్రామాల పరిధిలోని 1274.25 ఎకరాల ప్రభుత్వ, పట్టా భూములను సేకరించాలని సర్కారు నిర్ణయించగా అక్కడి రైతులు భగ్గుమంటున్నారు. కొన్నేండ్లుగా ఆ భూములపై ఆధారపడి జీవిస్తున్నామని.. వాటి ని ఫార్మా కంపెనీలకు ఇస్తే ఎలా బతకాలని నిలదీస్తున్నారు. గత రెండు నెలలుగా ప్రతిరోజూ కడాతోపాటు దుద్యాల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ప్రజలు, రైతులు నిరసన తెలుపుతూనే ఉన్నారు. ప్రాణాలైనా ఇస్తాం.. కానీ.. భూములను ఇచ్చేది లేదని తెగేసి చెబుతున్నారు. మేము వేసిన ఓట్లతో ఎమ్మెల్యేగా గెలిచి.. ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి మమ్మల్ని రోడ్డుపాలు చేస్తామంటే ఊరుకునేది లేదని, తగిన బుద్ధి చెబుతామని హెచ్చరిస్తున్నారు. భూములిస్తే మా బతుకులు రోడ్డున పడతాయని, ఊర్లు వదిలి వలసపోవాల్సి న దుస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసైన్డ్ భూముల కంటే అధికంగా మా పట్టా భూములకు పరిహారం ఇవ్వ డంతోపాటు ఫార్మా విలేజ్‌తో ఎలాంటి కా లుష్య సమస్యలు ఏర్పడవని ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన విడుదల చేస్తేనే.. భూ ములిచ్చే విషయాన్ని ఆలోచిస్తామని చెబుతున్నారు. ఇప్పటికే రైతులకు మద్దతుగా పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఆందోళనలు నిర్వహించాయి. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రోడ్లపై ధర్నాలు చేపట్టారు. తమ గోడును మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు దృష్టికి రైతులు తీసుకెళ్లారు.

**703.65 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్...**

ఫార్మా కంపెనీల ఏర్పాటు కోసం దుద్యాల మండలంలోని పోలేపల్లి గ్రామంలోని సర్వేనంబర్ 67లో 130 ఎకరాలు, హకీంపేటలోని సర్వేనంబర్ 252లో 366 ఎకరాలు, లగచెర్లలోని సర్వేనంబర్ 102లో 140 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. అయితే ఈ భూమి సరిపోకపోవడంతో ప్రభుత్వ, పట్టా భూములను కలిపి మూడు గ్రామాల పరిధిలో మొత్తం 1274.25 ఎకరాలను సేకరించాలని సర్కారు నిర్ణయించింది. హకీంపేటలో 505.37 ఎకరాలు, పోలేపల్లిలో 130 ఎకరాలు, లగచెర్లలో 643 ఎకరాలను సేకరించాలని నిర్ణయించింది. ఇప్పటికే లగచెర్ల పరిధిలోని 632. 26 ఎకరాలు, పోలేపల్లిలో 71.39 ఎకరాల పట్టా భూములను సేకరించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.

### మేము.. ఏం పాపం చేశాం..



మేము.. ఏం పాపం చేశామని ప్రభుత్వం ఇంతటి దారుణానికి ఒడిగట్టుతున్నది. పచ్చటి పొలాల్లో చిచ్చుపెట్టేలా.. ఈ ప్రాంతంలో ఫార్మా కంపెనీల ఏర్పాటుకు ప్ర భుత్వం యత్నించడం బాధాకరం. రేవంత్‌రెడ్డి సీఎం అయితే ఈ ప్రాంతం అభివృ ద్ధి చెందుతుందని.. నీళ్లు వస్తాయని ఆశించాం. కానీ.. ప్రజా జీవనానికి భంగం కలిగించేలా ఫార్మా కంపెనీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం తగదు.

**– గోపాల్‌నాయక్, ఫార్మా బాధిత రైతు, పులిచర్లతండా, దుద్యాల**

### నోటి కూడు లాక్కొంటే.. చావే శరణ్యం..



వ్యవసాయంతోనే మా బతుకు, తిండి. అటువంటి భూములను లాక్కోవాలని ముఖ్యమంత్రే చూస్తుంటే ఇక మాకు చావే శరణ్యం. ప్రభుత్వం రైతులను ఇబ్బం ది పెట్టకుండా అందర్ని ఒకేసారి చంపేసి, మా మృతదేహాలపై కంపెనీలను ఏర్పాటు చేయండి. ఉన్న ఎకరం, రెండు ఎకరాల భూమి పోతే ఎట్లా బతకాలి. రేవంత్ ముఖ్యమంత్రి అయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని భావిస్తే.. మా జీవనాధారాన్ని లాక్కోవాలని చూడడం దారుణం.. కేసీఆర్ సార్ ఉన్నప్పుడే బాగుండే. ఆయన్ను వదులుకొని చాలా తప్పు చేశాం..అనుభవిస్తున్నాం.

**– లక్ష్మీబాయి, లగచెర్ల, దుద్యాల మండలం, కొడంగల్**

### మేం భూములివ్వం..



వ్యవసాయం పండుగలా సాగుతున్న ఈ ప్రాంతంలో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావించడం సరైంది కాదు. మేం భూములివ్వం. భూములు వదులుకొని ఎక్కడికెళ్లాలి. మాది, మా పిల్లల భవిష్యత్తు ఏమి కావాలి. వారసత్వం గా వచ్చిన భూములను ఎందుకు ఇస్తాం. ప్రభుత్వం వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. బీడు భూముల్లో ప్రజా శ్రేయస్సుకు తోడ్పడే కంపెనీలను ఏర్పాటు చేయాలి.

**– కుమ్మరి శివకుమార్, ఫార్మా బాధిత రైతు, హకీంపేట, దుద్యాల**



### ఊరు బాగుంటేనే అందరూ బాగుంటారు..



ఊరు బాగుంటేనే ప్రజలందరూ బాగుంటారు. ఫార్మా కంపెనీల ఏర్పాటుతో ఊరు కాలుష్యమైతే మేము ఏ విధంగా బాగుంటామో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలి. గతంలో కేసీఆర్ సార్ రైతులు, ప్రజలకు ఏమి కావాలో ఆలోచించి అందించేవారు. కరోనా కాలంలోనూ వ్యవసాయానికి ఎటువంటి ఇబ్బంది కలిగించలేదు. అలాంటి నాయకుడ్ని వదిలేసుకుని.. రైతులతోపాటు అన్ని వర్గాలను ఇబ్బంది పెడుతున్న రేవంత్‌ను ఎన్నుకున్నందుకు ఇప్పుడు బాధ పడుతున్నాం. ప్రజల కష్టసుఖాలను తెలుసుకొని పాలన చేపట్టాలి.. కానీ, స్వప్రయోజనాల కోసం ప్రజలను ఎరగా వేయడం ఎంతవరకు సమంజసం. భూములు ఇచ్చేదే లేదు. ఏమి జరిగినా అం దుకు సిద్ధమే. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి.

**– వెంకటేశ్, పోలేపల్లి, దుద్యాల మండలం, కొడంగల్**